
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.7 | కనిష్ఠం 22.5
కామారెడ్డి జిల్లా వార్తలు
3
సోమవారం 14 ఏప్రిల్ 2025



నేడు తాడ్వాయిలో మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు కోరారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తదాతలు పెద్ద సంఖ్యలో విచ్చేసి రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రక్తదాన శిబిరం కొనసాగుతుందని మిగిలిన వివరాలకు 9492874006 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

రేషన్ కార్డుల కోసం.. ఎదురు చూపులు!





- దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక యాప్
- మరోసారి సర్వే చేయనున్న అధికారులు
- పెండింగ్‌లో 40 వేలకు పైగా దరఖాస్తులు
- ఇవి కాకుండా గ్రామ సభల్లో మరో 30 వేలకు పైగా వచ్చిన దరఖాస్తులు
- కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరం
- జిల్లాలో రేషన్‌కార్డులు ఉన్నది 2.53 లక్షల మందికి మాత్రమే

కామారెడ్డి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పేట్లు లేవు. రేషన్ కార్డుల జారీ మరింత ఆలస్యం కానుంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు మున్సిపల్, పంచాయతీశాఖల సిబ్బంది మరోసారి సర్వే చేయనున్నారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. జిల్లాలో 40 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ప్రజాపాలన, గ్రామ, పట్టణ సభల ద్వారా మరో 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. మీసేవ కేంద్రాల ద్వారా మరికొన్ని దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలో వచ్చిన దర ఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ చేశారు. ఈ వివరాలన్నింటిని ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేకయాప్‌కు అనుసం ధానం చేశారు. ఈ యాప్‌లో దరఖాస్తుదారుడి పేరు ఎంటర్ చేయగానే వారి వివరాలు అన్ని యాప్‌లో కనపడుతాయి. కొత్త రేషన్‌కార్డులను ప్రభుత్వం జారీ చేయకపోవడంతో పలు సంక్షేమ పథకాలకు పేద, మధ్య తర గతి ప్రజలు దూరమవుతున్నారు. రేషన్‌కార్డులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ వస్తోంది.

జిల్లాలో 2.53 లక్షల రేషన్‌కార్డులు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 2.53 లక్షలు మాత్రమే రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహారభద్రత కార్డులు 2,34,743 ఉండగా అంత్యోదయ ఆహారభద్రత కార్డులు 17,655 ఉన్నాయి. అన్నపూర్ణకార్డులు 901 ఉన్నాయి. ఈ కార్డులకు మొత్తం 8.59 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రేషన్ కార్డు ఆధారంగానే ఆయా కుటుంబాలకు పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు మంజూరు చేస్తు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కొన్ని పథకాలకు మాత్రమే రేషన్ కార్డును ప్రామాణికంగా చేశాయి. ఆ ప్రభుత్వం కొత్త స్కీంలు తీసుకువచ్చినప్పటికి పలు స్కీంలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోలేదు.ఇదే నేపథ్యంలో రేషన్‌కార్డులకై గత 10 ఏళ్లలో అర్హులైన లబ్దిదారులు దరఖాస్తులు చేసుకున్న మోక్షం లభించలేదు. ప్రభుత్వం సైతం దరఖాస్తులను పెండింగ్‌లోనేఉంచింది.

పెండింగ్‌లో 40,042 వేలకు పైగానే దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడు నెలల కిందట కొత్తరేషన్‌కార్డుల కోసం సర్వే నిర్వహించింది. జిల్లాలో గతంలో కొత్త రేషన్‌కార్డులకు సుమారు 40 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే రాష్ట్రప్రభుత్వం నుంచి మాత్రం 21,842 మంది మాత్రమే కొత్తరేషన్ కార్డుల కోరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది. ఈ జాబితాను జిల్లా పౌరసరాఫరాలశాఖ విచారణ కోసం ఎంపీడీఓ,మున్సిపల్ అధికారుల క్షేత్రస్థాయిలో చేపట్టారు. అనంతరం గ్రామ, పట్టణ సభలు నిర్వహించి కొత్త రేషన్‌కార్డుల అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాల్సి ఉండగా వాయిదా పడింది. అయితే గత జనవరి 26న పైలెట్ ప్రాజెక్ట్ కింద 22 గ్రామాల్లో ఎంపిక చేసిన వారికి మాత్రమే కొత్త రేషన్‌కార్డులు జారీచేశారు. గతంలో వచ్చిన 40 వేల దరఖాస్తులే కాకుండా ప్రజాపాలనలో, గ్రామసభల్లో మరో 30 వేలకు పైగా దరఖాస్తు లు వచ్చాయి. వీటిని మరోసారి సర్వేచేసేందు కు కొత్తయాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అదేవిధంగా కుటుంబంలో తమ పిల్లలకు వివాహాలు జరిగి కోడళ్ల పేర్లను, వారికి జన్మించే పిల్లల పేర్లను కార్డులో చేర్చేందుకు కూడా ప్రభుత్వం ఇటీవల అవకా శం ఇచ్చింది. కొత్తపేర్ల నమోదుకోసం ఈ సేవనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందు కోసం సుమారు 15వేలకు పైగా దరఖాస్తులు ఉన్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.

మరోసారి సర్వే

కొత్తరేషన్‌కార్డుల అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం కొత్తయాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి దరఖాస్తుదారుల వివరాలను యాప్‌కు అనుసంధానం చేసింది. ఈ యాప్ ద్వారా గ్రామాల్లో పంచాయతీ, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటికివెళ్లి పరిశీలించనున్నారు. వారి ఆదాయ స్థితిగతులు గతంలో రేషన్‌కార్డు ఉందా తల్లిదండ్రుల పేరిట గల రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్నాయా తదితర అంశాలపై సర్వే చేయనున్నారు. వారుచెప్పిన అంశాలను యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసేవరకు మరో నెలరోజుల పాటు పట్టవచ్చని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కొత్తకార్డుల జారీకోసం జనవరిలో నిర్వహించిన గ్రామ,పట్టణ సభలకు ముందు పరిశీలనచేపట్టినప్పటికి ఆ తర్వాత దరఖాస్తులు చాలానే రావడంతో మరోసారి పరిశీలనకు ప్రత్యేకయాప్‌ను రూపొందించారు. కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారోనని దరఖాస్తుదారులు నిరిక్షించాల్సి వస్తుంది.

ప్రాణహిత-చేవెళ్ల ప్యాకేజీ 22 పనులు చేపట్టాలి



జలసౌధలో మంత్రి ఉత్తమ్‌తో చర్చిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ప్యాకేజీ-22 పనులు చేపట్టాలని, భూసేకరణ నిధులు వెంటనే విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కోరారు. ఆదివారం జలసౌధలో నిర్వహించిన సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంతంలో సాగునీటి మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేసేందుకు ప్రాణహిత-చేవెళ్ల నిజామాబాద్, కామారెడ్డి నీటి పారుదల ప్రాజెక్ట్ ప్యాకేజీ 22ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతులకు కీలకమైన నీటి పారుదల పనుల పురోగతిని వేగవంతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రాణహిత - చేవెళ్ల ప్యాకేజీ 22 కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్ట్‌ను త్వరలో పూర్తి చేస్తామన్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆయకట్టును స్థిరీకరించడం, స్థిరమైన నీటి సరఫరా చేయడం ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. లీకేజీని అరికట్టేందుకు, ప్రవాహ సామర్థ్యాన్ని మెరుగుపరి చేందుకు ప్యాకేజీ-20 కింద నిజాంసాగర్ ఏకీకృత కాలువ వెంబడి కాంక్రీట్ గోడల నిర్మాణానికి ఆమోదం, ఎగ్జిక్యూటివ్ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీతో సమ న్వయంతో ప్యాకేజీ-21 కింద పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారని తెలిపారు. ప్యాకేజీ 21ఏకు సంబంధించి ప్రాణహిత - చేవెళ్ల పథకం తరహాలో కొత్త రిజర్వాయర్‌ను నిర్మిస్తామని తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 20 వేల ఎకరాలకు సాగునీరు అందేలా అవసరమైన నిధులు విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. నాగమ డుగులో రబ్బర్ డ్యాం నిర్మాణానికి సాధ్యాసాధ్యాలు చేపట్టి ముంపునకు గురికాకుండా, సమీపంలోని భూములను పరి రక్షిస్తామన్నారు. సింగీతం ప్రాజెక్ట్ వద్ద వరదల వల్ల దెబ్బతిన్న రక్షణ పనులను వెంటనే పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారని, కౌలాస్‌నాలా ఆధునికీకరణ అవకాశాలను తాజా అంచనాలను సమర్పించి పరిశీలించాలని అధికారులకు సూచించారని తెలిపారు. నిజాంసాగర్ డ్యామ్ సమీపంలోని 12 ఎకరాల భూమికి శాఖాపరమైన విధివిధానాల ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయడం ద్వారా ఏకో టూరిజాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం యోచిస్తుందని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ మరమ్మతులకు రెగ్యులర్ నిధులు మంజూరు చేస్తామని, నీటి సరఫరా, నిర్వహణకు అంతరాయం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఎంపీ సురేష్‌షెట్కార్, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



లింగంపేటలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం

అకాల వర్షంతో ఆగమైన రైతులు

లింగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆగమయ్యారు. చేతికి వచ్చిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద, కొందరు రోడ్లపైన ఆరబోసారు. అకాల వర్షంతో ధాన్యం తడిసి పోడంతో రైతులు ధాన్యాన్ని తడవకుండా ఉంచేందుకు నానా తిప్పలు పడ్డారు. పర్మల్ల, శెట్పల్లి, అయ్యపల్లి గ్రామాల్లో వడగండ్లు పడడంతో కోతకు వచ్చిన ధాన్యం భూమిపై రాలిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం బోరుబావులు వట్టిపోవడంతో వరి పంటలు నీటి కొరత కారణంగా 30 శాతం పంటలు ఎండిపోయాయి. కొంత పంటను రోగాలతో నష్టపోయారు. ఈ సంవత్సరం వరి పంట వేసిన రైతులు నష్టాల్లో ఉండగా చేతికి వచ్చిన కొంత పంటనైనా అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే ఆకాల వర్షం అక్కడ కూడా వదలడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు తూకం మాత్రం వేయడం లేదు. ఎందుకు తూకం వేయడం లేదని రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ప్రశ్నించగా రైస్‌మిల్లులు అలాట్‌మెంట్ కాలేదని, హమాలీలు రాలేదని కారణాలు చేబుతున్నారని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం అన్‌లోడ్‌లో అవకతవకలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్నూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు విక్రయించిన వరి ధాన్యం అన్‌లోడ్‌లో తక్కువగా చూపించి అవకతవకలకు పాల్పడుతున్నారంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'వరి ధాన్యం అన్‌లోడ్‌లో అవకతవకలు' అనే కథనానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించారు. ఆదివారం కుర్లా గ్రామానికి వచ్చి 40 బస్తాలపై విచారణ చేపట్టారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఖలీద విచారణలో పాల్గొన్నారు. రైతులు, మిల్లు యజమానులతో మాట్లాడారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత వెయిట్ బ్రిడ్జిలో లోపం కారణంగా 40 బస్తాల ధాన్యం తూకంలో తక్కువగా వచ్చినట్లు నిర్ధారణకు వచ్చినట్లు వెల్లడించారు. రైతులకు తక్కువగా వచ్చినా 40 వరి ధాన్యం బస్తాల డబ్బులను ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. బస్తాలకు సరిపడా డబ్బులను రైస్‌మిల్లు యజమానుల ద్వారా ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, అటువంటిది రైతులకు తూకంలో మోసం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుంచి ఎటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఐకేపీ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఏపీఎం రవీందర్, సీసీ అనిల్ ఉన్నారు.



కుర్ల గ్రామంలో వరి ధాన్యం విక్రయించిన రైతులతో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఏజెన్సీల కేటాయింపులో నిబంధనలు బేఖాతర్

- గాడితప్పిన ఉపాధి కల్పనశాఖ
- ఏజెన్సీల కేటాయింపుల్లో, ఉద్యోగాల భర్తీలో నిబంధనలు గాలికి
- వివాదాస్పదంగా మెడికల్ కళాశాల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ
- పెద్ద ఎత్తున నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకుల ఆందోళనలు
- విచారణ పేరుతో అధికారుల కాలయాపన
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థి సంఘ నాయకుల ప్రయత్నం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారికి జీవనాధారాన్ని చూపించాల్సిన ఉపాధి కల్పనశాఖ అధికారులు అడుగడుగునా నిబంధనలు తుంగలో తొక్కుతూ గాడి తప్పుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే మెడికల్ కళాశాల పోస్టుల భర్తీ ప్రక్రియలో కొందరు సిబ్బంది పనితీరుపై ఆరోపణలు రావడంతో ఆ శాఖ ప్రతిష్ఠ మసకబారుతూ వచ్చింది. ప్రస్తుతం ఇటీవల జరిగిన ఏజెన్సీల కేటాయింపుల్లోనూ నిబంధనలు బేఖాతారు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలను ఇష్టారీతిన ఎంపిక చేశారని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఉద్యోగాలను అమ్ముకున్నారని ఆరోపణలు వచ్చిన ఏజెన్సీలను సైతం మళ్లీ ఎంపిక చేశారని, టెండర్ వేసే సమయంలో సూచించిన నియమ నిబంధనలను ఎక్కడా పరిశీలించిన దాఖలాలు లేవనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో పెద్ద ఎత్తున డబ్బులు చేతుల మారాయని న్యాయంగా రావాల్సిన వారికి కావాలనే ఉద్యోగాలు రాకుండా చేశారని, నిబంధనలు పాటించకుండా నియామక పత్రాలు అందించడం, అన్యాయం జరిగిందని అధికారుల దగ్గరకి వెళితే విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తుండడంతో ఆ వివాదం ఇంకా నివ్పురవ్వల వెలుగుతునే ఉంది. ఉపాధి కల్పన శాఖతో పాటు మెడికల్ కళాశాలలోని ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై మంగళవారం జిల్లాకు రానున్న ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థి సంఘ నాయకులు సిద్ధమవుతున్నారు.

ఏజెన్సీల కేటాయింపుల్లో నిబంధనలు భేఖాతారు

ఇటీవల ఉపాధి కల్పన శాఖాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన ఏజెన్సీల కేటాయింపుల ప్రక్రియలో నిబంధనలు బేఖాతర్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏజెన్సీలు టెండర్‌లు వేసిన సమయంలోనే జిల్లా కేంద్రంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్మికుల, సిబ్బంది ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కార్యాలయాలు ఏర్పాటు చేయాలి కానీ అలాంటి కార్యాలయాలు ఇటీవల కేటాయించిన ఏజెన్సీలకు చాలా వరకు లేనే లేవు. టెండర్‌లు వేసిన ఏజెన్సీలలో ఒకటి, రెండు కార్యాలయాలు మాత్రమే ఉండగా మిగిలిన వాటికి కార్యాలయాలే కనిపించకపోవడం కొసమెరుపు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులకు ముడుపులు ఇవ్వడంతో ఆ కార్యాలయాలు ఉన్నాయా లేదా అనేది క్షేత్రస్థాయిలో చూడకుండానే కేటాయింపులు చేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి టెండర్ వేసిన తర్వాత కార్యాలయాలను పరిశీలించి అక్కడ ఫొటోలు తీసుకున్న తర్వాతనే ఆ ఏజెన్సీకి కేటాయింపు చేయాల్సి ఉంటుంది. కార్మికులకు ఏదైన నష్టం జరిగినప్పుడు కార్యాలయానికి వెళ్లి ఏజెన్సీ నిర్వాహకులను కలిసేందుకు కనీస సౌకర్యం లేకుండా ఉన్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు లేకపోలేదు. ఇక మెడికల్ కళాశాల వ్యవహారంలో ఓ ఏజెన్సీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీతాలల్లో భారీగా కోత విధించింది. విషయం ఆ నోట ఈనోట బయటకు పొక్కడంతో తిరిగి చెల్లిస్తామని చెప్పి వారికి మొండి చేయినే చూపింది. ఇలాంటి విషయాల్లో విచారణ చేపట్టి ఆ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాల్సి ఉండగా ఆ ఏజెన్సీని సైతం ఎంపిక చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

వివాదాస్పదంగా మెడికల్ కళాశాలలోని పోస్టుల భర్తీ ప్రక్రియ

మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన చేపట్టిన నియామక ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని, పోస్టులకు డబ్బులు తీసుకుని అర్హులైన వారికి అన్యాయం చేశారని నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తు ఉద్యమిస్తుండడంతో నివ్పురవ్వల ఆ వివాదం వెలుగుతునే ఉంది. మెడికల్ కళాశాలలో చేపట్టిన పోస్టుల విషయంలో అడుగడుగున నిబంధనలు విస్మరించారని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొంటున్నారు. ఉద్యోగ ప్రక్రియకు సంబంధించి మెడికల్ కళాశాలలో లేదంటే ఉపాధికల్పనశాఖ వద్ద దరఖాస్తులు స్వీకరించి వాటిని అందులోని ప్రభుత్వ అధికారి ఆధ్వర్యంలో స్క్రూటినీ చేయాల్సి ఉండగా ఏజెన్సీ నిర్వాహకులు వారి సొంత ఎజెండాతో దరఖాస్తులు స్వీకరించారని ఆరోపిస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత అర్హులైన వారి సర్టిఫికెట్ల జిరాక్స్‌లను తొలగించి వారు ఉద్యోగాలు ఇవ్వాలనుకునే వారికి ఉద్యోగం వచ్చేలా చేశారని, గతంలో మెరిట్ వచ్చిన వారు ఇప్పుడు మెరిట్‌లో లేకపోవడం, సర్టిఫికెట్లు గతంలో అందించడంతో ఎలాంటి రిమార్క్ లేదు. కానీ ఏజెన్సీ చేపట్టిన భర్తీ ప్రక్రియలో అవే సర్టిఫికెట్లు లేవని రిమార్క్‌లో చూపడం చేశారని ఆరోపిస్తున్నారు. ఇక మెరిట్ లిస్టు వేసి నియామక పత్రాలు అందించాల్సి ఉండగా నియామక పత్రాలు అందించి మెరిట్ లిస్టు వేయడం ఏంటో ఉన్నతాధికారులే సమాధానం ఇవ్వాలని అంటున్నారు. మాకు అన్యాయం జరిగింది మహాప్రభో అంటూ అధికారులకు మొర పెట్టుకున్నా విచారణ పేరుతో కాలయాపన చేయడంతో పాటు ఏజెన్సీ ఇష్టారీతిన ఎంపిక చేసిన వారికి నియామక పత్రాలు అందించి విభాగాలను కేటాయించారని పేర్కొంటున్నారు.



జిల్లా ఉపాధి కల్పనశాఖ కార్యాలయం

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థి సంఘాల కసరత్తు

జిల్లాలోని ఆయా శాఖలకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు రివ్యూ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కల్పనశాఖలో ఏజెన్సీల కేటాయింపులో నిబంధనలు బేఖాతారు, మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీపై మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థి సంఘ నాయకులు కసరత్తు చేస్తున్నారు. గతంలోనూ కళాశాలలో పోస్టుల భర్తీ ప్రక్రియపై మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పూర్తి విచారణ జరపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశించడంతో ఈ వ్యవహారంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మరోమారు నిరుద్యోగులకు అన్యాయమే జరిగిందని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులు ఉద్యమిస్తున్నా అధికారుల పనితీరులో మార్పులేదని దీంతో ఇక మంత్రి దృష్టికే ఈ వ్యవహారం తీసుకెళ్లి అధికారుల పనితీరును ఎండగడుతామని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొంటున్నారు.

చలో వరంగల్ పోస్టర్ల ఆవిష్కరణ



వేల్పూర్‌లో చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లోని తన నివాసంలో ఆదివారం చలో వరంగల్ పోస్టర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో తలపెట్టనున్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు బాల్కొండ నియోజకవర్గం నుంచి అన్ని మండలాలు, గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నిజాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్

నవీపేట,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ జే.రాంచందర్ కోరారు. ఆదివారం మండలంలోని నిజాంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్ గౌడ్, రమేష్, పెద్దన్న, బుచ్చన్న, బాలచందర్ గౌడ్, రమేష్ గౌడ్, గంగారాం, అంజాగౌడ్, ఏపీఎం భూమేష్ గౌడ్, గ్రామ సంఘం అధ్యక్షురాలు సాయమ్మ తదితరులున్నారు.

పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

మోర్తాడ్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. వీటి ధరలు పెంచడంతో దేశ ప్రజలపై పెనుభారం పడుతుందని జిల్లా నాయకులు కిషన్ ఆరోపించారు. ప్రధాని మోదీ 11 ఏళ్లుగా సంపన్నుడైన కార్పోరేట్ల కొమ్ముకాస్తు పేదలపై ధరలో పన్నులు పెంచి వారి వెన్ను విరుస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా చమురు, క్రుడాయిల్ రేట్లు తగ్గిన మన దేశంలో పెట్టుబడిదారులకు వత్తాస్ పలుకుతూ ధరలు పెంచడం సిగ్గు చేటని అన్నారు. ఇప్పటికైన ప్రధాని మోదీ పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దయాసింగ్, దశరత్, గజానంద్, దర్శన్‌సింగ్, భూమన్న, గోవింద్ సింగ్, ఆటో యూనియన్ నాయకులు గంగాధర్, రమేష్, భూమన్న, చిన్నయ్య, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధి కోసం రూ. 75 వేల విరాళం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని విశాఖ కాలనీలో గల శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి శివ పంచాయతన పంచముఖ హనుమాన్ ఆలయానికి ఇనుప జాలి ఏర్పాటు నిమిత్తం దాత విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, బెనికి నారాయణ, బెనికి లక్ష్మీ దంపతులు రూ. 75వేల విరాళాన్ని అందజేశారు. ఆదివారం రూ. 75వేలు ఆలయ కమిటి సభ్యులకు దాత అందజేశారు. ఆలయానికి విరాళం అందించిన దంపతులను ఆలయ కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశాఖ గంగారెడ్డి, ఆలయ కమిటి సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అమెరికాలోని అట్లాంటాలో భగవద్గీత ప్రచారం



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని అట్లాంటాలో ఉగాది, శ్రీరామ నవమి పండుగ సందర్భంగా భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని బోధన్ పట్టణానికి చెందిన సభ్యులు దైవజ్ఞాన ప్రచారంలో భాగంగా భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వారి కోసం భగవద్గీత బుక్‌స్టాల్ ఏర్పాటు చేశారు. అమెరికాలో ఉన్న తెలుగు వారు భగవద్గీత పుస్తకాలు లభ్యమవ్వడంతో అక్కడ ఉన్న తెలుగువారు సంతోషం వ్యక్తం చేశారు. ఆమెరికాతో పాటు వివిధ దేశాలలో బోధన్ పట్టణానికి చెందిన సభ్యులు దైవజ్ఞాన ప్రచారంలో భాగంగా భగవద్గీత బుక్‌స్టాల్‌ను నిర్వహిస్తుంటారు. బోధన్ వాసులు వారిని అభినందిస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):నిత్యం యోగ చేయడం వల్ల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పతాంజలి యోగ సమితి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షురాలు మంజుశ్రీ అన్నారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని ఎస్ఎస్‌కే భవన్‌లో మహిళ పతాంజలి యోగ సమితి ఆరోగ్య సభ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత ఆరోగ్య సలహాలు యోగాలో మెలకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక లాభాలను పొందడానికి చేయాల్సిన మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు రెడ్డి ప్రకాష్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు ఖాందేష్ సంగీత, సునీత జైరాజ్, గట్టడి స్వాతి, బోజేకర్ వీణ, కమల, లక్ష్మీ, మంజుల, ప్రేమ, సరస్వతి పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ పట్టివేత

నవీపేట,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం శివారులో ఆదివారం అక్రమంగా మొరం తరలిస్తున్న ఒక జేసీబీ, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచారం మేరకు సంబంధిత వాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్ తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు వాహనాల యాజమాని సూర నర్సయ్య, డ్రైవర్లు షేక్ జునైద్ ఖాన్, నగేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



రుద్రూరులో అంబేద్కర్ విగ్రహాన్ని కడుగుతున్న బీజేపీ నాయకులు



అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం గావ్ చలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం అంగడి బజార్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని కడిగారు. రుద్రూరు గోశాలలోని గోవులను శుభ్రం చేసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంత్ గౌడ్, హరికృష్ణ, సాయన్న, రాజు, కృష్ణం రాజు, రాజారాం, శంకర్, మురళి, శ్రీనివాస్, గంగాధర్, సతీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో గావ్/బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామంలోని దళితవాడలో ఊరేగింపుగా వెళ్లి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దళితవాడలో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కందగట్ల రాంచందర్, కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గెంటె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, దళిత మోర్చా కన్వీనర్ కోటేష్, యువమోర్చా కన్వీనర్ సాయి,బూత్ అధ్యక్షులు, నాయకులు తదితరులున్నారు.

సమస్యల వలయంలో భీమ్‌గల్ పట్టణం : ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి

భీమ్‌గల్,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో గతంలో నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే విధంగా ఉన్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భీమ్‌గల్ పట్టణంలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాథం చెరువు మినీ ట్యాంక్ బండ్ చేస్తామని మాజీ మంత్రి రూ. 6 కోట్లు పై చిలుకు నిధులు మంజూరు చేయించి నాసిరకం పనులు చేసి డబ్బులు మొత్తం కాజేసినారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మండల ప్రజలకు ఆర్టీసీ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి విస్మరించాడని, సమీకృత మార్కెట్, వంద పడకల ఆసుపత్రి పనులు మధ్యలో నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా వాటిని పరిష్కరించడంలో విఫలమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ పట్టణ అధ్యక్షుడు మధు, మాజీ ఎంపీటీసీ ఆరే రవీందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట గంగాధర్, పట్టణ కిషన్ మోర్చా అధ్యక్షుడు నీలం గంగాధర్, ఎస్టీ మోర్చా మండల ఉపాధ్యక్షుడు రమావతు వెంకటేష్, భీమ్‌గల్ సర్వసమాజ్ కమిటీ కోశాధికారి కాపు కుమ్మరి హరీష్, సీనియర్ నాయకులు సంధ్య, రాజు, పీరీ గంగాధర్, చిన్ని నర్సయ్య, ముచ్కుర్ కూరు ప్రసాద్, జైగురు ప్రసాద్, గోపారం సురేందర్, తోపారం నరేంధర్, నరేందర్ గౌడ్, నవీన్, తక్కురి అంజయ్య, కంఠం శేఖర్, నామాల వెంకటేష్, దర్శన్, నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ము.. ప్రైవేటు పాలు

● డిచ్‌పల్లిలో చేపల విక్రయించే స్టాల్‌లో పండ్ల రసాల దుకాణం ● పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు

డిచ్‌పల్లి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లిలో చేపల మార్కెట్ నిర్మాణ పనుల ప్రారంభ సమయంలో తీసుకొచ్చి ఇక్కడ ఉంచిన చేపలు విక్రయించే స్టాల్ ఇక్కడి నుంచి తరలించి ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డి పల్లి స్వాగత తోరణం వద్ద ఓ వ్యాపారి పండ్ల రసాల దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. మత్స్యశాఖ కి చెందిన ఈ స్టాల్ ని గతంలో హైదరాబాద్ నుంచి డిచ్‌పల్లి తీసుకొచ్చి ఉంచారు. గత 2ఏళ్లు గా వృధగా పడి ఉన్న ఈ స్టాల్ ను తరలించి పండ్ల రసాల దుకాణానికి ఇవ్వడంతో మత్స్యశాఖ అధికారులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చేపలు విక్రయించే ఈ స్టాల్ కు రంగులు వేసి దాని రూపురేఖలు మర్చివేయడం కొసమెరుపు. డిచ్‌పల్లిలో చేపల మార్కెట్ పనులు ప్రారంభం గాకముందే ఈ స్టాల్ ను ఇతర



చేపల విక్రయించే స్టాల్ లో ఎల్లారెడ్డి పల్లి వద్ద ఏర్పాటు చేసుకున్న పండ్ల రసం దుకాణం

వ్యాపారస్థులు ప్రైవేట్ వాళ్లకు అప్పజెప్ప డంతో అధికారులపై గుసగుసలు వినబడుతున్నాయి. ఈ విషయమై మత్స్యశాఖ జిల్లా ఏడీఆంజ నేయులను వివరణ కోరగా స్టాల్ మత్స్యశాఖ కు చెందినది కానీ దానిని ఏ వ్యాపారానికి అయిన వాడుకొవచ్చని చెప్పడం గమన్హారం.

బషీరాబాద్‌లో గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 13: (ఆంధ్రజ్యోతి)మండలంలోని బషీరాబాద్ కాడిచెరువులో కొలువుదీరి ఉన్న గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభమయ్యాయి. ఏప్రెల్ నెల 13నుండి 17 వరలకు నిర్వహింపబడే గంగమ్మ ఆలయ వార్షి కోత్సవంలో భాగంగా తొలి రోజు ఆదివారం గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు వలగొడుగు ఉత్సవాన్ని నిర్వహిస్తు ఉత్సవ మూర్తులను గ్రామం నుండి కాడిచెరువులోని గంగమ్మ గుడికి చేర్చారు. ఆలయ అర్చకులు జగదంబాదేవి ఉపాసకులు మంత్రాజ్యం కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సుంకెట నారాయణ, ఉపాధ్యక్షులు మోతే రవిందర్ సంఘ సభ్యులు గంగమ్మ దేవి దీక్షపరులు, గంగపుత్ర సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.14 న స్థాపిత దేవతా హోమాలు, కళశ పూజ 15 న రుద్రహోమం, మహాచండీ యాగం, కుంకుమార్చన16 న గంగామాత మహాభిషేకం, అలంకరణ, నైవేద్యహారతి, శివపార్వతి గంగామాత కల్యాణం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గంగామాతకు కాడిచెరువులో చక్రస్నానం పల్లకి ఊరేగింపు, 17న మాల విరమణ తదితర కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో హజరై అమ్మవారి కృపకు పాత్రులు కవాలని ఉత్సవ నిర్వహకులు కోరారు.



బషీరాబాద్‌లో వలగడుగు ఉత్సవం నిర్వహిస్తున్న గంగపుత్ర సభ్యులు

బీజేపీ కార్యకర్తకు పరామర్శ

మెండోర,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):మండలంలో సావెల్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ బూత్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ ను భారతీయ జనతా పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఇటీవల కొలిపాక శంకర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మల్లికార్జున్‌రెడ్డి ఆయన నివాసా నికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.ఆయన వెంట బీజేపీ నాయకులు నిమ్మల శ్రీనివాస్, మారముత్యంరెడ్డి, తదితరులు ఉన్నారు.

సులేమాన్ నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోటగిరి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని సులేమాన్ నగర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ ఖాదర్ ప్రారంభించారు. కోటగిరి, రుద్రూరు ప్రధాన రహదారి నుంచి బసవేశ్వర మందిర వరకు సుమారు రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్ రావు దేశాయ్, నారాయణ రావు, లతీఫ్, దస్తాగిరి, ఖాదర్, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోటగిరి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని క్యాన్సర్ వ్యాధితో బాదపడుతున్న చిన్నారి కుటుంబానికి ఆదివారం బాన్సువాడ నియోజకవర్గ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన చింతల రాజు, రేణుక దంపతుల రెండేళ్ల కూతురు మహన్విత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ తన ట్రస్టు ద్వారా 5వేల రూపాయల ఆర్థిక సహయంతో పాటు నెలవారి మందులకు ఆర్థిక సహయం అందిస్తానని భరోసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, మండల అధ్యక్షులు హరికృష్ణ, సీనియర్ నాయకులు కటికె రాజారాం, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

అమీనాపూర్ చర్చిలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

వేల్పూర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో ఆదివారం మన్నా చర్చిలో పాస్టర్ జాన్‌విల్సన్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. యేసుక్రీస్తు భక్తి పాటలు , నృత్యాలతో దేవున్ని ఆరాధించారు. అనంతరం గాడిద పిల్లగ ఉండి మీద కూర్చొని యేసుక్రీస్తును మందిరం చుట్టు తిప్పి చర్చిలోకి ఆహ్వానించారు. అనంతరం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా పాస్టర్ జాన్ విల్సన్ క్రీస్తు యొక్క బోధనను వివరించారు.

సిరికొండలో అంబేడ్కర్ విగ్రహం శుద్ధి

సిరికొండలో గావ్ చలో - బస్తీ చలో కార్యక్రమం విజయవంతం

సిరికొండ ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు సిరికొండ మండల కేంద్రంలో ఆదివారం గావ్ చలో - బస్తీ చలో కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. సిరికొండ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ .అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి రంజిత్‌రెడ్డి, యువమోర్చ మండల అధ్యక్షుడు మధు,జిల్లా కార్యద ర్శి రాజేశ్వర్. జిల్లా నాయకులు రాజేశ్వర్‌రెడ్డి,కిసాన్‌మోర్చమండల అధ్యక్షులు ప్రభాకర్, గంగారెడ్డి, మారుతి,అజయ్,కిరణ్,శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జలాల్‌పూర్‌లో అన్నదానం

వర్ని,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఆదివారం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో మండల పరిసరాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రావుట్లలో చలివేంద్రం ప్రారంభం

సిరికొండ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నేతలు ఆదివారం ప్రారంభించారు. పాత గ్రామ పంచాయతీ వద్ద బస్టాండ్‌లో ప్రయాణికులకు వేసవిలో దాహర్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ నాయకులు దామోదర్ చెప్పారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్,బాబన్న,జమున,శ్యామల,డాక్టర్ గోపాల్,వీడీసీ చైర్మన్ కొడిగెల నందు గంగాదాస్,మోతిలాల్,కాంగ్రెస్ నాయకులు రమేష్ గౌడ్,సామెల్,రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జాన్కంపేట్‌లో చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు జక్రాన్‌పల్లిలో 9మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన బనవత్ ఈరబాయి రూ.25వేల 500లు, జైడి మల్లు బాయికి రూ.13వేల 500లు, హర్షయాఫీర్ దోస్త్‌కు రూ.28వేలు, ధనుంజయ్‌కి రూ. 60వేలు, రత్నాల శేఖర్‌రావుకు రూ. 12వేలు, పడకంటి శ్రీజకు రూ 20వేలు, ముస్కు గంగనర్సుకు రూ. 24 వేలు, తొగరి రాములుకు రూ. 18వేలు, మలావత్ రాముకు రూ. 26 వేలు సీఎంఆర్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, మండల మైనార్టీ అధ్యక్షుడు అక్బర్, మాజీవైస్‌ఎంపీపీ జితేందర్ నాయక్, నట్ట తిరుపతి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్: మండలం జాన్కంపేట గ్రామంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనీల్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్యంతో పేదలు ఆసుపత్రిలో చికిత్స ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం వరం లాంటిదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ గౌడ్ అన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, అందుకు సహకరించిన బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్,కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శెట్టివినోద్, సౌడ శ్రీనివాస్, జేమ్స్ గంగారెడ్డి, రంఘుకిశోర్‌గౌడ్, జీజీ గంగారెడ్డి, నర్సారెడ్డి, అరుణ్‌రాజ్, జైరాజ్ పాల్గొన్నారు.

● వాడి గ్రామంలో..

మండలంలోని వాడి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం నర్సారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాలలో 45 మంది లబ్ధిదారులకు గాను రూ. 12 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఐదుగురి లబ్ధిదారులకు మంజూరీ అయిన చెక్కులను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న వారికి బాల్కొండ నియోకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునిల్ కుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరీ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం జీవన్, ముస్కు మోహన్, బద్ధం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, దండెవోయిన సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

15న డిచ్‌పల్లిలో రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం : మాజీ జడ్పీటీసీ



డిచ్‌పల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతం కోసం ఈ నెల 15న సాయంత్రం 4గంటలకు డిచ్‌పల్లి గాంధీనగర్ శివారులో గల జీ కన్వెన్షన్ లో నిజామాబాద్ రూరల్ నియోజక వర్గ స్థాయి బీఆర ఎస్ కార్యకర్తలు, నాయకుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. ఆదివారం ఆయన డిచ్‌పల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ కవిత,మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌లు హాజరువుతున్నారని జగన్ తెలిపారు. కావున నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు క్రిష్ణ, పద్మరావు, సాయిలు, ఒడ్డం నర్సయ్య, సుధం నాయక్, పాల్గొన్నారు.

పలువురి మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

వేల్పూర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం కుకునూర్, వాడి గ్రామాలలో ఇటీవల అనారోగ్యంతో మరణించి రెండు కుటుంబాలను ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. కుకునూర్ గ్రామానికి చెందిన శ్యాంయాదవ్ వాళ్ల తాత మల్కన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అలాగే వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మహేందర్ వాళ్ల మామ నడ్పి బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సునీల్‌రెడ్డి ఆదివారం వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి , ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి

ఇందల్వాయి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన దూస సంతోష్‌కు కిడ్నీ ఆపరేషన్ కోసం 5లక్షల ఎల్‌వోసి పత్రాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కిడ్నీ ఆపరేషన్ నిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్‌లో చేయించుకునే సమయంలో పేద కుటుంబం కావడంతో అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మెండె అశోక్, సంతోష్ ఆరోగ్య పరిస్థితిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే ఎమ్మెల్యే స్పందించి 5లక్షల ఎల్‌వోసి పత్రాన్ని అందజేశారు. ఎల్‌వోసి ఇప్పించడానికి కృషి చేసిన మెండో అశోక్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవీపేటలో ప్లాస్టిక్ రహిత వివాహం

● సంప్రదాయ పద్ధతిలో భోజనాల వడ్డింపు ● వివాహాన్ని ఆదర్శంగా జరిపించడం పట్ల అతిథుల ప్రశంసలు

నవీపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ప్లాస్టిక్ రహిత వివాహం జరిగింది. స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఫోటో స్టూడియో యజమాని నాంపల్లి వసంత్ కుమార్, ఉమాదేవి దంపతులు తమ కూతురు అనూహ్య వివాహాన్ని బీదర్‌కు చెందిన పవన్‌తో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివాహం జరిపించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న వివాహాల్లో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుండగా దానికి భిన్నంగా ప్లాస్టిక్ రహిత వివాహన్ని జరిపించడం విశేషం. ఫంక్షన్ హాల్‌లో గేటు బయట ప్లాస్టిక్ ఫ్లెక్సీకి బదులుగా బట్టపై కళాకారుడితో నూతన వధూవరుల పేర్లను రాయించారు. గేటు లోపల బట్టపైన డిజైన్ చిత్రాలతో ఉన్న స్వాగత తోరణాన్ని ఏర్పాటు చేశారు. పెళ్లి పందిరిలో కొబ్బరి కొమ్మలు, సహజ సిద్ధంగా పూసిన పూలతో డెకరేషన్ చేశారు. భోజనాల వద్ద సుమారు 2వేల మంది అతిథులకు కుర్చీలు, బెంచీలను ఏర్పాటు చేసి మోదుగ ఆకుతో తయారు చేసిన విస్తారాకులలో వివిధ రకాల వంటకాలను వడ్డించారు. తాగునీటి కోసం ప్లాస్టిక్ గ్లాసులు కాకుండా స్టీల్ గ్లాసులను ఏర్పాటు చేశారు. ఫ్రూట్ సలాడ్‌లను మోదుగ ఆకుతో తయారు చేసిన దొనేలలో అందించారు. భోజన శాలలో గోడలపై ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే నష్టాల గురించి చార్ట్‌లపై రాసి ప్రదర్శించారు. ప్లాస్టిక్ వస్తువులలో తినడం గాని తాగడం గాని చేయవద్దని దీని ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని ప్లాస్టిక్ వినియోగంతో ఆరోగ్యానికి హానికరంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందని అందులో వివరించారు. ప్లాస్టిక్ వినియోగించకుండా సంప్రదాయ పద్ధతిలో తన కుమార్తె వివాహాన్ని జరిపించిన నాంపల్లి వసంత్ కుమార్, ఉమాదేవి దంపతులను పెళ్లికి వచ్చిన అతిథులు అభినందించారు. ఈ వివాహన్ని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో మరింత మంది ఈ పద్ధతిని ప్రతి ఒక్కరు పాటించినట్లయితే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన వారు అవుతామని పలువురు పేర్కొన్నారు.


నవీపేటలో సంప్రదాయబద్ధంగా వేసిన పెళ్లి మండపం



ఫ్లెక్సీ బదులు బట్టపైన కళాకారుడితో రాయించిన వివాహ ఆహ్వానం



బట్టపైన రాసిన భారతీయ కల్యాణ సంస్కృతి


సంప్రదాయ పద్ధతిలో టెబుళ్లు, కుర్చీలు వేసి విస్తరాకుల్లో భోజనం వండిస్తున్న దృశ్యం


సంప్రదాయ పద్ధతిలో టేబుళ్లు, కుర్చీలు వేసి విస్తారాకుల్లో భోజనం వండిస్తున్న దృశ్యం

ప్రమాదకరంగా మారిన రహదారి

● ఆదమరిస్తే అంతే సంగతి


కొత్తపల్లి- ముప్కాల్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా మారిన కల్వర్టు


ప్రమాదకరంగా మారిన మూలమలుపు

ముప్కాల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ నుంచి కొత్తపల్లి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ముప్కాల్ నుంచి కొత్తపల్లి వెళ్లే దారిలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో మూలమలుపు వద్ద పురాతన కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో వాహనదారులు అజాగ్రత్తగా నడిపిన ఆదమరిస్తే అంతే సంగతి. ఈ రోడ్డుపై మరమ్మతులు జరిపి డబుల్ తారురోడ్డుగా మార్చారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాల్సి ఉండగా, నిర్మించక పోవడంతో ఇప్పుడు అదే కల్వర్టు కూలిపోయి వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదు. ముప్కాల్ శివారులో జాతీయ రహదారిపై అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో హైవేపైకి వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ఇదే రోడ్డుపై నిత్యం అనేక వాహనాలు వెళ్తుండడంతో తారు రోడ్డు ధ్వంసమైంది. ఇదే స్థలంలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులకు ప్రయాణం కష్టంగా మారింది. సంబంధిత అధికారులు ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకొని కల్వర్టు నిర్మించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు


కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు


కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

వర్ని, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం పాత వర్ని గ్రామంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. చివరి కుస్తీ వీరుడికి 1001రూపాయలు నగదు అందజేశారు. కుస్తీ పోటీల్లో ఉమ్మడి జిల్లాలతో పాటు మహరాష్ట్ర నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ ఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తారు.

లక్ష్మాపూర్‌లో..

మోస్రా: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో అదే విధంగా మోస్రా మండల కేంద్రంలో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొనేందుకు కర్నాటక, మహరాష్ట్రల నుంచి మల్లయోధులు పోటాపోటీగా తలపడ్డారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు వెండి కడియం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బిల్లా పోతారెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు, చుట్టూ మండలాల, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉమ్మడి వర్ని మండల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో..

మోపాల్: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ముదక్ పల్లి గ్రామంలో ఆదివారం సూదులమ్మ ఆలయం వద్ద కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రథోత్సవం, జాతర నిర్వహించారు. ప్రతీ సంవత్సరం హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వ హించడం ఆన వాయితీగా వస్తుందని తెలిపారు. ఈ కుస్తీ పోటీలో మోపాల్ మం డలం కుస్తీవీరులే కాకుండా మహారాష్ట్ర నుంచి పోటీ దారులు వచ్చి పోటీలో పాల్గొంటారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి వెండి కడియం, నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, వీడీసీ పెద్దలు పాల్గొన్నారు.

వెలుగునివ్వని హైమాస్ట్ లైట్లు

•చీకటిమయంగా చౌరస్తా • కన్నెత్తి చూడని అధికారులు

మహమ్మద్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గుగుడిసె చౌరస్తాలో ఉన్న హైమాస్ట్ లైటు రోజుల తరబడి వెలగకపోవడంతో ఆ ప్రాంత మంతా చీకటి మయంగా మారుతుంది. నిజాంసాగర్-కామారెడ్డి, బాన్సువాడ- ఎల్లారెడ్డి, బాన్సువాడ - నిజాంసాగర్‌కు వెళ్లెందుకు ప్రజలు వేచి ఉండడంతో ఈ ప్రాంతమంతా నిత్యం రద్దిగా ఉంటుంది. రాత్రి వరకు ఈ ప్రాంతం గుండానే ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. కాని ఈ ప్రాంతమంతా చీకటిమయంగా మారడంతో భిక్కుభిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. హసన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ వీధిలైట్లు చెడిపోయి 15 రోజులు కావస్తున్న ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని ప్రయాణికులు ఆవేదన చెందు తున్నారు. రాత్రివేళలో అగంతకులు విచ్చలవిడిగా మద్యం తాగుతూ రోడ్లపై సంచరిస్తుండడంతో చీకటిగా ఉన్న ప్రాంతంలో ఉండలేని మహిళలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన చౌరస్తాలోనే ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉంటే ఇక గ్రామాల్లోని వీధి లైట్ల పరిస్థితి ఏమిటనేది అర్థంచేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చౌరస్తాలో హైమాస్ట్ లైట్ల మరమ్మతులు చేయించి ప్రజలకు వెలుగులు పంచేలా కృషి చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద ఉన్న హైమాస్ట్ లైట్లు

ఎండిన చెట్టు కింద సేద తీరుతున్న పాడి గేదెలు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం కోమన్ పల్లి శివారులోని గోదావరి తీరానికి మేతకు వెళ్లిన పాడి గేదెలు ఎండ వేడిమి నుంచి సేద తీరేందుకు పచ్చని చెట్లు లేకపోవడంతో ఎండిన మోడు కిందనే సేద తీరుతున్న దృశ్యం.


ఎండిన మోడు కింద సేదతీరుతున్న పాడి గేదెలు

కల్వర్టుపై గుంతను పూడ్చండి సారూ


కల్వర్టుపై ఏర్పడిన గుంత

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 35వ వార్డులో డ్యామేజ్ అయిన కల్వర్టు పనులను ఒకసారి చూడండి సారూ అని కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు. గతవారం రోజుల క్రితం ప్రధాన రోడ్డుకు మధ్యన కల్వర్టు కూలిపోవడంతో రంధ్రం ఏర్పడింది. అటువైపు వెళ్తన్నా వాహనదారులకు రంధ్రం ఏర్పడక వాహనాల టైర్లు ఇరుక్కుపోయి నానా అవస్థలు పడుతున్నారు. దీన్ని గమనించిన కాలనీ వాసులు డ్యామేజ్ అయిన కల్వర్టు రంధ్రంలో చెట్టు కొమ్మను పెట్టారు. అధికారులు రంధ్రాన్ని పూడ్చి కల్వర్టునీ బాగు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఘనంగా ఆదినాథ స్వామి దేవాలయం జాతర

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జక్రాన్ పల్లిలో శనివారం అర్ధరాత్రి ఆదినాథ స్వామి దేవాలయం జాతర, రథోత్సవం ఘనంగా ని ర్వహించారు. స్వామి వారి రథోత్సవాన్ని భక్తులు లాగి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు యజ్ఞ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్స వాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. రథోత్సవాన్ని భక్తులు లాగి ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం స్వామివారి చక్రతీర్థం జరిగింది. సోమవారం స్వామివారి నాగవెళ్లి జరగనుంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సా రెడ్డి, బాలకిషన్, వసంత్‌రావు, జితెందర్‌నాయక్, వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.


ఆదినాథ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, నాయకులు

ఫొటో న్యూస్


కమ్మర్‌పల్లి జాతీయ రహదారి నుంచి తిమ్మాపూర్ వెళ్లే రహదారికి కనిపించని బోర్డు


గ్రామ బోర్డులేని చౌట్‌పల్లి, హసాకొత్తూర్ గ్రామాల మధ్య నుంచి వడ్యాట్ వెళ్లే రహదారి

ఏదారెటుపోతుందో ఎవరికీ ఎరుక

• దారుల వద్ద గ్రామాల బోర్డులు లేక వాహనదారుల తికమక

జాతీయ రహదారులు మొదలుకొని ప్రతీ గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రహదారుల వద్ద ఆయా గ్రామాల పేర్లు.. ఆ గ్రామాల దూరం కిలోమీటర్లు ఉండేవి.. వాటి ఆధారంగానే ప్రయాణికులు వాహనదారులు ఆయా గ్రామాలకు వెళ్లి వస్తుంటారు. కానీ ఈ మధ్య వాటి విషయం సంబంధిత ఆర్ అండ్‌బీ గాని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జాతీయ రహదారి సంబంధిత అధికారులు వాటి ఏర్పాట్లను మరిచిపోవడంతో అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరైతే గ్రామాల సూచిక బోర్డు లేక ఎక్కువ దూరం ప్రయాణం సాగించి తిరిగి వెనక్కిరావలసిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారుల ఇప్పటికైనా స్పందించి గ్రామాలకు వెళ్లే దారుల వద్ద ఆయా గ్రామాల పేర్లు వాటి దూరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

• (ఆంధ్రజ్యోతి, కమ్మర్‌పల్లి)


జాతీయ రహదారి నుంచి నాగాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై కనిపించని బోర్డు



బీర్కూర్‌లో గజ్జెలమ్మ జాతర రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

బీర్కూర్‌లో ఘనంగా రథోత్సవం

బీర్కూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతీ ఏటా బీర్కూర్ మండల కేంద్రంలో గజ్జలమ్మ జాతర ఉత్సావాలు జరుగుతాయి. శనివారం జాతర ఉత్సవాలు గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు మార్లు రథోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథం ముందుకు సాగింది. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతీ ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. జాతర ఉత్సవాలకు భక్తులు దూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

నేడు అయ్యప్ప ఆలయంలో విషు పూజ

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం విషు పూజ నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు భక్తులచే మూలవిరాట్టుకు నెయ్యాభిషేకం జరిపించబడునని , నెయ్యాభిషేకం చేయదలచిన వారు తప్పనిసరిగా సాంప్రదాయ దుస్తులను ధరించవలెనని సూచించారు. అభిషేకం చేసిన నెయ్యిని భక్తులకు ప్రసాదంగా అందించబడునన్నారు. అదేవిధంగా ఆయల ప్రాంగణంలో భజన , పడిపూజ కార్యక్రమాలతో పాటు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



ఎల్లారెడ్డి అగ్ని మాపక కేంద్రంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

అగ్ని మాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ వినోద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్ చేతుల మీదుగా అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20 వరకు ఉంటాయని తెలిపారు. మహిళలు వంట గదిలో వంట చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అగ్ని ప్రమాదాల బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యాసాగర్, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రవీంద్ర భారతిలో పద్మ విభూషణ్ అవార్డు అందుకుంటున్న గోపాల్‌గౌడ్

భారత్ విభూషణ్ అవార్డు అందుకున్న ఎల్లారెడ్డి వాసి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చుక్క గోపాల్ గౌడ్‌ను ముంబాయి సంస్థ నేషనల్ ఆర్టిస్ట్‌గా గుర్తించింది. ఆదివారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారత్ విభూషణ్ 2025 అవార్డును అందుకున్నారు. రాష్ట్రంలోనే కాకుండా వివిధ ప్రాంతాల్లో ఆర్టిస్టుగా అనేకమైన విశ్లేషణాత్మకమైనటువంటి కళాకారుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించినందుకు విశిష్ట గౌరవం దక్కిందని గోపాల్ తెలిపారు. అవార్డుకు ఎంపికైన సందర్భంగా పట్టణ ప్రజలు గోపాల్ గౌడ్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన వ్యక్తి భారత్ విభూషణ్ అవార్డుకు ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని జెయస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1994-95 జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతకు ముందు తోటి విద్యార్థులు మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. అనంతరం వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు కిషన్, జయదేవ్, కిష్టయ్య, షారపుల్లక్‌లకు సన్మానించారు. అనంతరం ఆనాటి మధుర స్మృతులు గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో వినోద కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, రమేష్ గౌడ్, వెంకట్ రాములు, యశ్వంత్ రావు, షేక్ మొహీనోద్దీన్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీకి యత్నం

● ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు టెక్రియాల్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. పాఠశాల వెనకభాగంలో ఉన్న ప్రహరి గోడ దూకి పాఠశాలలోకి ప్రవేశించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్ రూమ్ తాళాన్ని పగలగొట్టేందుకు ప్రయత్నించడంతో పాటు వరండాలోని ఓ సెల్ఫ్‌పైన ఉన్న ఫ్యాన్‌లు, ఇతర ఎలక్ట్రిక్ వస్తువులనుసంచిలో వేసుకుని పారిపోతుండగా స్థానికులు వెంబడించారు. ఇందులో ఇద్దరు పారిపోగా ఒకరు దొరికారు. దీంతో పోలీసులకు సమాచారం చేరవేసి పట్టుబడిన వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

నేటితో ముగియనున్న రాజీవ్ యువవికాసం దరఖాస్తు ప్రక్రియ

● గత మూడు రోజుల నుంచి సర్వర్ డౌన్
● ఆన్‌లైన్ సేవాకేంద్రాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
● మరికొన్ని రోజులు గడువు పొడిగించాలని విన్నపం

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్‌యువవికాసం పథకాన్ని అమలుచేస్తుంది. ఇందులో భాగంగా గత నెలరోజుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చేపట్టింది. గతంలో ఓ సారి దరఖాస్తు గడువు ముగియడంతో ఈనెల 14 వరకు గడువును పొడగించింది. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఈ పథకానికి నిరుద్యోగులు ఉపాధి నిమిత్తం దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలను కునేవారికి ఆదాయ,కుల ధృవికరణ పత్రాలు కావాల్సి ఉండగా రోజుల తరబడి ధృవపత్రాల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయాల చుట్టు తిరగడంతో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ వెనువెంటనే ధృవపత్రాలను అందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు పత్రాల జారీని వేగవంతం చేశారు. అధికారులు అందిస్తున్న ధృవపత్రాలు తీసుకుని ఆన్‌లైన్ కేంద్రాలకు వె ళ్తున్న వారికి ప్రస్తుతం సర్వర్ డౌన్‌తో మరిన్ని చిక్కులు ఏర్పడుతున్నాయి.

నేటితో ముగియనున్న గడువు

రాజీవ్‌యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ నేటితో ముగియనుంది.ఈనెల 15 నుంచి దరఖాస్తులకు సంబంధించిన స్క్రూటినీచేపట్టి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని అధికారులకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ప్రక్రియ ముగిశాక ఫోటోలు,సంబంధిత జిరాక్స్ కాపీలు జతచేసి మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలలో అందించాల్సి ఉంటుంది.అయితే కొందరు ఆన్‌లైన్ ప్రక్రియ చేసుకుని పత్రాలను మాత్రం ఆయా కార్యాలయాల్లో అందించడం లేదని తెలుస్తుంది. దరఖాస్తు ఫారాలకు నంబర్‌లు కేటాయించి వాటిని రిజిస్టర్‌లలో నమోదుచేస్తున్నామని ప్రతి ఒక్క దరఖాస్తుదారుడు ఖచ్చితంగా ఆన్‌లైన్ ప్రక్రియ జరగగానే పత్రాలను తీసుకువచ్చి కార్యాలయాలలో అందించాలని అధికారులు పేర్కొంటున్నారు. ఆ పత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను నివేదించనున్నామని తెలిపారు.అధికారులు పరిశీలించి ఎంపిక చేసిన వారికి జూన్ 2 న స్వయం ఉపాధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనుంది.

మూడు రోజుల నుంచి సర్వర్‌డౌన్

రాజీవ్ యువవికాసం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సేవాకేంద్రాలకు వెళ్తున్న దరఖాస్తుదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గత మూడు రోజులుగా సర్వర్ డౌన్ కావడంతో దరఖాస్తులను నిర్వహకులు అప్లయ్ చేయడం ఆపేశారు. ఉదయం 11గంటల తర్వాత అందరూ దరఖాస్తు చేసుకుంటున్నందున సర్వర్‌డౌన్ ఉంటుందేమోనని ఉదయం 7గంటలకు, రాత్రి 10 గంటల తర్వాత అయిన ప్రయత్నిస్తున్న వారికి నిరాశే మిగులుతుంది. గతంలో ధృవపత్రాల విషయంలో రోజుల తరబడి వేచిచూసి తీరా పత్రాలు అందిన తర్వాత ఇప్పుడు సర్వర్ కోసం ఎదురుచూడాల్సి వస్తుందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు ఈ ఇబ్బందులను తీర్చాల్సి ఉండగా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మూడు రోజుల నుంచి సర్వర్ డౌన్ ఉండడంతో దరఖాస్తులు చేసుకోలేకపోయామని దీనికి తోడు సెలవులు ఉండడంతో దరఖాస్తు చేసుకునేందుకు వీలు లేకుండా పోతుందని ప్రభుత్వం మరికొన్నిరోజులు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ ప్రవీణ్‌కుమార్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవుల్ల తెలిపారు. ఆదివారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఉపాధ్యాయసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పెంచాలని, బదిలీలు, పదోన్నతులలో ప్రవేశాలు మెరుగుపరిచిన వారికి పాయింట్స్‌లో ప్రాధాన్యత ఇస్తామని అనడం సమంజసం కాదని తెలిపారు. ఎక్కడ అయితే గురుకులాలు, మోడల్ స్కూల్స్, హస్టల్స్ ఉంటాయో వాటికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఎట్టి పరిస్థితులలో ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పెంచుట సాధ్యంకాదని తెలిపారు. ప్రైవేట్ పాఠశాల సంఖ్య కూడా అధికంగా ఉందని కాబట్టి ప్రభుత్వం ఈ అంశంపైన పునరాలోంచాలని తెలిపారు. ప్రభుత్వ బడులలో మౌలిక వసతులు మెరుగుపరిచి పనులు పూర్తి చేసిన పాఠశాలలకు బిల్లులు చెల్లించాలని, కులగణన సర్వే చేసిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ అందించాలని, డీఎస్‌సీ-2008 అభ్యర్థులకు వేతనాలు చెల్లించాలని అన్నారు. పది మూల్యాంకనం విధులు నిర్వహిస్తున్న స్పెషల్ అసిస్టెంట్స్‌కు మొక్కుబడిగా ఇస్తున్న రెమ్యూనరేషన్ పెంచాలని, ఎస్‌ఎస్‌సీ ఇన్విజిలేషన్ జుక్కల్ మండలంలో సస్పెండ్‌చేసిన ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలని తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో హన్మంత్‌రెడ్డి, ప్రభాకర్,రాములు, పందిరి రాజేష్, ముజిబుద్దిన్, రాములు,స్వామి, యాదయ్య, గఫూర్‌శిక్షక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామచంద్ర స్వామి, పార్వతీ రాజరాజేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న గ్రామస్థులు

రామారెడ్డి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ పార్వతీరాజరాజేశ్వర స్వామి రథోత్సవాల వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రామారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ పార్వతీరాజరాజేశ్వర స్వామి విగ్రహాలను వేద పండితులు, పూజారులు విగ్రహాలను తీసుకొచ్చి పెద్దలు రథాల గైన్ చౌరస్తా వద్దా పెట్టారు. భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ రథోత్సవాలను ఊరేగింపు నిర్వహించారు. రథాలను రామారెడ్డి నుండి కామారెడ్డి వైపు మూడు కిలోమీటర్ల దూరంలో వైపు తీసుకెళ్లి తిరిగి వచ్చారు. శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ పార్వతీరాజేశ్వర స్వామి విగ్రహాలను బాజభజంత్రీలతో ఊరేగింపు భక్తి శ్రద్ధలతో పాటలు, నృత్యాలతో ఆలయాలకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటీ చైర్మెన్ రంగు రవీందర్ గౌడ్, ఆలయ సూపరింటెండెంట్ బుర్ర ప్రభురాంచంద్రం గుప్తా, ఎస్సై నరేష్, ప్రతినిధులు శంకర్ గౌడ్, కుశన్నోల్ల రమేష్, గంగాధర్ చారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సామాల శీలాసాగర్, పురోహితులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, వివిధ రకాల నేతలు, నాయకులు పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



సిద్ధరామేశ్వరనగర్‌లో భజన చేస్తున్న గ్రామస్థులు

సిద్ధరామేశ్వరనగర్‌లో భజన

భిక్కనూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ హనుమాన్ ఆలయంలో భజనమండలీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజామున వరకు పెద్దఎత్తున భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భజన మండలి ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రతిశనివారం భజన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. భజన సందర్భంగా బోనాల శ్రీనివాస్ అల్పాహారం అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రమణ మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రమణ ఆదివారం అనారోగ్యంతో మరణించడం టీపీటీఎఫ్‌కు తీరని లోటని రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయునిగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఒకవైపు శ్రమిస్తునే సమసమాజస్థాపన కోసంశ్రామిక వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం ఉద్యమమార్గంలో పయనించిన వ్యక్తి అని అన్నారు. సాధారణకార్యకర్త నుంచి పెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించి విద్యార్థుల పక్షాన ఉపాధ్యాయుల పక్షాన పోరాడిన నాయకుడుని అన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

ఇళ్ల లబ్ధిదారులకు చెక్కుల అందజేత

బాన్సువాడ టౌన్ , ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గంలోని నసురుల్లాబాద్ మండలానికి చెందిన డబుల్ బెడ్ రూం లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో బిల్లులకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిదులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులున్నారు.


సీఎంఆర్‌ఫ్ చెక్కు అందజేత

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రతన్ సింగ్ తాండకు చెందిన రాహుల్‌కు సిఎంఆర్‌ఫ్ ద్వారా మంజూరైన 45 వేల రూపాయల చెక్కును మండల కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మోహన్ మాట్లాడుతు వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో చికిత్స పొందిన వారికి ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చెక్కులను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహానికి రంగులు వేశారు. నీలి రంగు జెండాలతో ముస్తాబు చేశారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల రైతుల సంక్షేమం కోసమే జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు సహకార సంఘం అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సహకార సంఘం ఆవరణలో మార్క్‌పెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతు రైతులు ఆర్థికంగా నష్టపోకూడదే ఉద్దేశ్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు తాము పండించిన జొన్నలను దళారులకు అమ్మకుండ కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి విక్రయం చేసుకోవాలని సూచించారు. దీంతో పాటుగానే ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రబీ సీజన్‌లో గతంలో ఎన్నడు లేని విధంగా జొన్న పండించిన రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో మార్క్‌పెడ్ సహకారంతో జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలలో క్వింటా జొన్న ఖరీదు రూపాయలు 3371 గా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతుల నుండి ఎకరంకు 8.65 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు నాగి రెడ్డి, దస్తారెడ్డి, హనుమయ్య, కిషన్, సితవో సందీప్, ఏతవోలు రూప, రాజ్యలక్ష్మి, నాయకులు చిప్ప మోహన్, సంజీవ్, విఠల్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నమల్లారెడ్డిలో రాజ్యాంగ పరిరక్షణపై వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి
ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంను విస్మరించే పనులు చేస్తుందని సాక్షత్తు కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షాచేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నడుముబిగించిందని అందులో భాగంగానే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను ప్రతి గ్రామంలో చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ లక్ష్మీరాజాగౌడ్, రామాగౌడ్,మామిండ్ల అంజయ్య, సిద్దిరాములు, ఎల్లంరెడ్డి,హన్మండ్ల రాము, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బీజేపీ చేసిన పనులను వివరిస్తున్న నాయకులు

33వ వార్డులో గావ్ చలో-బస్తీ చలో అభియాన్ కార్యక్రమం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని 33 వ వార్డులో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో-బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపైయం పట్టణ ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఆవిర్భావం సందర్భంగా పార్టీ సంస్థగత కార్యక్రమాలలో భాగంగా దేశంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని వార్డులలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ గత 45 సంవత్సరాలలో సాధించిన విజయాలు, భవిష్యత్తులో సాధించాలని పెట్టుకున్న లక్ష్యాలు ప్రతి కార్యకర్తతో పాటు ప్రజలకు కూడా వివరించడం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని తెలిపారు. బీజేపీ పార్టీ, నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం అన్ని రంగాలలో ముందుకు దూసుకుపోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లాప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి,స్టేట్ కౌన్సిల్ సభ్యుడు విపుల్‌జైన్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు సంతోష్, వేణు, రాజేష్, భరత్, సాయిప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధ రామేశ్వరనగర్‌లో ట్యాంకర్‌తో పంటకు నీరు అందిస్తున్న రైతు

ఎండుతున్న చేతికొచ్చిన పంట..
ట్యాంకర్‌తో నీరు అందిస్తున్న రైతు

భిక్కనూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతుండటంతో రైతులు చేతికొచ్చిన పంటను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన సల్మెడి అనీల్‌కుమార్ తనుకున్న రెండు ఎకరాల పొలంలో వరి పంట వేయగా ఉన్నట్టుండి బోర్లు ఊహించని విధంగా నీరు పోయడం తగ్గాయి. దీంతో సరిగ్గా నీరు లేకపోవడంతో ఎకరంన్నర పొలం ఎండిపోగా మిగితా అర ఎకరం పొలాన్ని కాపాడుకోవడానికి ఒక ట్యాంకర్‌కు రూ. వెయ్యి చొప్పున రోజుకు రెండు పూటల ట్యాంకర్ల సహాయంతో రూ.2వేలు వెచ్చించి నీరు అందిస్తున్నాడు. ఎప్పుడు లేనివిధంగా ఒక్కసారిగా తమ బోర్లలో నీరు ఆగిపోవడం ఆశ్చర్యంగా ఉందని, ఎకరన్నర పంట ఎండిపోయి తీవ్ర ఇబ్బందుల పడుతున్నామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు. ఈ రైతే కాకుండా మండలంలోని పలు గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

బీఆర్‌ఎస్ మహాసభను విజయవంతం చేయాలి

భిక్కనూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్కతుర్తి వద్ద చేపట్టనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భిక్కనూరు మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దయారి సాయిరెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ ఆదేశాల మేరకు వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ మహాసభ కార్యక్రమానికి భిక్కనూరు మండలవ్యాప్తంగా అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయ్యడం జరుగుతుందన్నారు.

హైరాబాద్‌లో ధర్నాకు తరలిన మైనారిటీలు

లింగంపేట, ఎప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలని మైనారిటీలు హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు లింగంపేట మండలానికి చెందిన మైనారిటీలు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పతియోద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనారిటీల పట్ల చిన్నచూపు చూస్తుందని వక్ఫ్ బిల్లును ప్రభుత్వం వెంటనే వనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో హర్షద్, సాదిక్, గురు పాషా, రషీద్‌లతో పాటు మైనారిటీలు ఉన్నారు.